2026 కామన్వెల్త్ క్రీడల నుంచి 9 క్రీడాంశాల తొలగింపు

# భారత్‌కు తీవ్ర అన్యాయం

## బ్యాడ్మింటన్, షూటింగ్, రెజ్లింగ్‌కు పంగనామం • వ్యయాన్ని తగ్గించుకునేందుకే: సీడబ్ల్యూజీ • నిరాశలో భారత క్రీడా లోకం







సీడబ్ల్యూజీలో భారత్ అత్యధికంగా పతకాలు సాధించిన క్రీడాంశాలు

| | | | |
|---|---|---|---|
| షూటింగ్ | 135 | రెజ్లింగ్ | 114 |
| బ్యాడ్మింటన్ | 31 | టేబుల్ టెన్నిస్ | 28 |

★ ఈ నాలుగూ 2026లో కనిపించవు.

ఢిల్లీ: నాలుగేండ్లకోసారి జరిగే కామన్వెల్త్ క్రీడల (సీడబ్ల్యూజీ)లో భాగంగా 2026లో స్కాట్లాండ్‌లోని ప్రఖ్యాత గ్లాస్గో నగరంలో జరగాల్సి ఉన్న కామన్వెల్త్ క్రీడలకు ముందే భారత క్రీడాలోకానికి తీవ్ర అన్యాయం! 2026 జులై 23 నుంచి ఆగస్టు 2 దాకా జరుగబోయే 23వ కామన్వెల్త్ క్రీడలలో మన క్రీడాకారులు పతకాలు సాధించే పలు కీలక క్రీడాంశాలలోని తొమ్మిదింటిని తొలగిస్తున్నట్టు మంగళవారం కామన్వెల్త్ క్రీడా సమాఖ్య ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ అధికంగా పతకాలు సాధించే బ్యాడ్మింటన్, రెజ్లింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, స్క్వాష్ వంటి వాటితో పాటు ట్రయథ్లాన్, నెట్‌బాల్, రోడ్ రేసింగ్, గత ఎడిషన్‌లో చేర్చిన క్రికెట్ (మహిళల టీ20)నూ నిర్వాహకులు తొలగించారు. 2022 బర్మింగ్‌హామ్‌లో 19 క్రీడాంశాలతో ఈ క్రీడలను నిర్వహించగా 2026 ఎడిషన్‌కు గాను వాటిలో తొమ్మిదింటిని పక్కనబెట్టడం గమనార్హం. పలు ఈవెంట్స్‌ను తొలగించిన సమాఖ్య.. మరో 10 క్రీడాంశాలను చేర్చుతున్నట్టు తెలిపింది. వ్యయ నిర్వహణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు వెల్లడించింది.'మెగా ఈవెంట్‌లో బహుళ క్రీడల అనుభూతిని ఆస్వాదించేలా చేయడంతో పాటు వ్యయ, నిర్వహణ మధ్య సమతుల్యతను పాటిస్తాం' అని సీడబ్ల్యూజీ తెలిపింది.



### భారత్‌కు భారీ నష్టం

ఒలింపిక్స్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీతో పాటు ఆ ప్రమాణాలను అందుకోలేక పతకాల వేటలో వెనుకబడుతున్న మన క్రీడాకారులు ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో మాత్రం అంచనాలకు మించి రాణిస్తారు. 2018 కామన్వెల్త్ క్రీడలలో 66 పతకాలతో పతకాల పట్టికలో 3వ స్థానంలో నిలిచిన భారత్.. 2022లో 61 పతకాలు సాధించి 4వ స్థానం దక్కించుకుంది. 1958 నుంచి ఈ మెగా టోర్నీలో ఇప్పటిదాకా పాయింట్ల పట్టికలో మనం టాప్-8లోనే నిలుస్తున్నాం. ఇందులో మన క్రీడాకారులు అత్యధికంగా పతకాలు సాధించే బ్యాడ్మింటన్, షూటింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడాంశాలు లేకపోవడంతో రాబోయే సీడబ్ల్యూజీలో భారత పతక అవకాశాలు సగానికి సగం తగ్గే ప్రమాదముంది. 2018 ఎడిషన్‌లో వచ్చిన 66 మెడల్స్‌కు గాను అత్యధికంగా 44 (షూటింగ్‌లో 16, రెజ్లింగ్ 12, టేబుల్ టెన్నిస్‌లో 8, బ్యాడ్మింటన్‌లో 6, స్క్వాష్‌లో 2) ఈ క్రీడల్లోవే. ఇక గత ఎడిషన్‌లో 61 పతకాలకు గాను రెజ్లింగ్‌లో 12, టేబుల్ టెన్నిస్‌లో 7, బ్యాడ్మింటన్‌లో 6, స్క్వాష్‌లో 2 (మొత్తం 27) ఎక్కువగా ఈ క్రీడల్లో సాధించినవే. బర్మింగ్‌హామ్‌లోనే షూటింగ్‌ను పక్కనబెట్టి కొత్తగా చేర్చిన మహిళా క్రికెట్ టీ20 (2022లో భారత్‌కు రజతం)లనూ తర్వాతి ఎడిషన్‌లో తొలగించడంతో భారత్‌కు పతకాలు భారీగా తగ్గుతాయని క్రీడాభిమానులు వాపోతున్నారు. 1998లో చేర్చిన హాకీని సైతం ఈసారి తీసేశారు. 2022లో భారత్‌కు హాకీలో రెండు పతకాలు (రజతం, కాంస్యం) వచ్చాయి.

### గ్లాస్గో క్రీడలు పూర్తిగా భిన్నం : ఎన్‌ఆర్‌ఏఐ

సీడబ్ల్యూజీ నిర్ణయంపై నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ) స్పందిస్తూ.. 'రాబోయే క్రీడల్లో షూటింగ్‌ను చేర్చకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. వచ్చే కామన్వెల్త్ క్రీడలలో ఒలింపిక్స్‌లో ప్రముఖ క్రీడలలో చాలావాటిని పక్కనబెట్టడంతో అవి పూర్తి భిన్నంగా ఉండనున్నాయి. షూటింగ్‌ను చేర్చడానికి క్రీడా మంత్రిత్వ శాఖ, భారత ఒలింపిక్ సమాఖ్య (ఐవోఏ) చాలా యత్నించింది. అవసరమైతే షూటింగ్‌ను భారత్‌లోనే నిర్వహిస్తామనీ కోరినా ఫలితం లేకపోయింది' అని తెలిపింది. ఇదే విషయమై భారత దిగ్గజ షూటర్ గగన్ నారంగ్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.

**తొలగించేవి**
రెజ్లింగ్, బ్యాడ్మింటన్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, స్క్వాష్, హాకీ, ట్రయథ్లాన్, రోడ్ రేసింగ్, క్రికెట్

**చేర్చేవి**
స్విమ్మింగ్, పారా స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, పారా పవర్ లిఫ్టింగ్, పారా అథ్లెటిక్స్, పారా ట్రాక్ సైక్లింగ్, ట్రాక్ సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, పారా బౌల్స్, 3X3 వీల్ చైర్ బాస్కెట్ బాల్, బాస్కెట్ బాల్

### ఇది కుట్ర

ఈ నిర్ణయం షాక్‌కు గురిచేయడమే గాక భారత క్రీడాలోకానికి పెద్ద వెనుకడుగు. దీనివల్ల భారత్ 40 పతకాలు కోల్పోయే ప్రమాదంలో పడింది. ఇది కేవలం క్రీడలు, క్రీడాకారులకు జరిగిన నష్టమే కాదు. భారత్‌లో ఈ క్రీడలకు పెరుగుతున్న ఆదరణ, వస్తున్న పతకాలను కుదించడానికి చేస్తున్న కుట్రగా అనిపిస్తోంది. దీనిపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) తరఫున నిరసన వ్యక్తం చేస్తాం.

**- సంజయ్ మిశ్రా, బాయ్ సెక్రటరీ**

### సీడబ్ల్యూజీ అవసరం లేదు



కామన్వెల్త్ క్రీడలకు బదులు ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌ను మాత్రమే నిర్వహించడం ఉత్తమం. సీడబ్ల్యూజీ దాని ప్రభను కోల్పోతుంది. నా అభిప్రాయం ప్రకారం ఇక దాని అవసరం కూడా లేదు. బ్యాడ్మింటన్‌తో పాటు భారత్‌కు పతకాలు వచ్చే మరికొన్ని ఈవెంట్స్‌ను తొలగించడం బాధాకరం.

**- విమల్ కుమార్, బ్యాడ్మింటన్ మాజీ ఆటగాడు**

### తీరని అన్యాయం



బ్యాడ్మింటన్ మనకు అపారమైన గౌరవం, అపూర్వ విజయాలను తెచ్చింది. అంతర్జాతీయ క్రీడా వేదికలపై మెరవాలనుకుంటున్న వర్ధమాన ఆటగాళ్లకు ఇది శరాఘాతం. ఈ నిర్ణయం కేవలం భారత బ్యాడ్మింటన్‌కే కాదు, ప్రపంచ క్రీడాలోకానికి నష్టాన్ని చేకూర్చేదే. దీనికి వ్యతిరేకంగా భారత్ గొంతెత్తాలి.

**- పుల్లెల గోపీచంద్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్**



## తెలుగు టైటాన్స్‌కు రెండో ఓటమి



హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్‌కు వరుసగా రెండో పరాభవం ఎదురైంది. మంగళవారం రాత్రి స్థానిక జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 22-52తో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. జైపూర్ సారథి అర్జున్ దేశ్వాల్ ఏకంగా 19 పాయింట్లతో విజృంభించాడు. అతడితో పాటు అభిషేక్ (8), సుర్‌జీత్ (4) రాణించారు. వీళ్ల ధాటికి టైటాన్స్ నాలుగు సార్లు ఆలౌట్ అయింది. టైటాన్స్ తరఫున పవన్ సెహ్రావత్ (7), విజయ్ మాలిక్ (5) పోరాడారు. ఆట తొలి అర్ధభాగం మొదటి పది నిమిషాల్లో టైటాన్స్ ఆధిపత్యం ప్రదర్శించినా తర్వాత మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. రెండో భాగంలో జైపూర్ విజృంభణతో టైటాన్స్ డీలా పడింది.

## రెండో టెస్టుకు పంత్, గిల్ ఫిట్

పుణె: స్వదేశంలో న్యూజిలాండ్‌తో గురువారం నుంచి పుణె వేదికగా జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు భారత స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌తో పాటు వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఫిట్‌గా ఉన్నారని టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటె అన్నాడు. తొలి టెస్టుకు ముందు గిల్ మెడ కండరాలు పట్టేయగా అదే మ్యాచ్‌లో కీపింగ్ చేస్తూ పంత్ మోకాలికి గాయమైంది. డస్కటె మాట్లాడుతూ.. 'జట్టులో అందరూ ఫిట్‌గా ఉన్నారు. గిల్ గత వారం బ్యాటింగ్ చేశాడు. కొంత అసౌకర్యంగా ఉన్నప్పటికీ రెండో టెస్టు నాటికి అతడు పూర్తిస్థాయిలో సిద్ధమవుతాడు. పంత్ ఫిట్‌గా ఉన్నాడు' అని తెలిపాడు. గిల్ రాకతో మిడిలార్డర్‌లో సర్ఫరాజ్ ఖాన్, రాహుల్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో పిచ్, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టును ఎంపికచేస్తామని డస్కటె తెలిపాడు.

## కష్టాల్లో బంగ్లాదేశ్

ఢాకా: సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో ఢాకా వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టును 106 పరుగులకే ఆలౌట్ చేసిన సఫారీలు బ్యాట్‌తోనూ మెరిశారు. వికెట్ కీపర్ బ్యాటర్ కైల్ వీరేన్ (114) శతకంతో విజృంభించగా వియాన్ మల్డర్ (54) హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 308 పరుగులకు ఆలౌటై 202 పరుగుల కీలక ఆధిక్యాన్ని దక్కించుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 27.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 రన్స్ చేసింది. బంగ్లాదేశ్ ఇంకా 101 పరుగుల వెనుకంజలో ఉంది. మహ్మదుల్ హసన్ (38 బ్యాటింగ్), ముష్ఫికర్ రహీం (31 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

## టీడీసీఏ వల్లే హెచ్‌సీఏలో చలనం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధిని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని తెలంగాణ డిస్ట్రిక్ట్స్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లీపురం వేంకటేశ్వర రెడ్డి ఆరోపించారు. సోమవారం పాలమూరు స్టేడియంలో టర్ఫ్ వికెట్ నిర్మాణ పనులకు హెచ్‌సీఏ భూమి పూజ చేసిన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ.. '60 ఏండ్లుగా హెచ్‌సీఏ ఏనాడూ తెలంగాణ జిల్లాలలో క్రికెట్ అభివృద్ధిని పట్టించుకోలేదు. క్రికెట్‌లో సత్తా, నైపుణ్యం కలిగిన గ్రామీణ క్రీడాకారులను విస్మరించింది. కానీ టీడీసీఏ ఏర్పడటంతోనే హెచ్‌సీఏలో చలనం వచ్చింది' అని అన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 22: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి కళ్యాణ మండపంలో తెలంగాణ అండర్-15 బాలబాలికల రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వంద మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్‌కుమార్, ఆర్బిటర్స్ సాయి ప్రదీప్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.





# రంగస్థలం తర్వాత చూసిన మంచి సినిమా

''పొట్టేల్' సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. దర్శకుడు సాహిత్ ఇంత గొప్పగా తీస్తాడని అనుకోలేదు. నిర్మాతలు చాలా ప్యాషన్‌తో తీశారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో 'రంగస్థలం' తర్వాత చూసిన మంచి సినిమా ఇదే. అందరూ తప్పక ఎంకరేజ్ చేయాల్సిన సినిమా' అని సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా అన్నారు. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్ చేసిన రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. సాహిత్ మోత్ఖూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగే నిర్మాతలు. ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అతిథిగా పాల్గొన్న సందీప్‌రెడ్డి వంగా పై విధంగా స్పందించారు. 'ఈ సినిమా ఇచ్చే ఎక్స్‌పీరియన్స్ ఏదైతే ఉందో.. అది ఇంతకుముందు మీరు ఎక్కడ కూడా ఫీల్ అయి ఉండరు. అదైతే కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. చదువుకోడానికి మన పేరెంట్స్ ఎంత కష్టపడ్డారో గ్రాండ్ పేరెంట్స్ చెబితే అందరం వినుంటాం. దాన్నే ఈ సినిమా ద్వారా విజువల్‌గా చూపించాను. ఆ విజువల్స్ చూస్తే స్టన్ అవుతారు. ఇందులో అందరూ అద్భుతంగా నటించారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ కథకు ప్రధాన బలం. సాంకేతిక నిపుణులంతా మనసుపెట్టి పనిచేశారు. ఇలాంటి సినిమా తీసినందుకు గర్విస్తున్నా' అని దర్శకుడు సాహిత్ మోత్ఖూరి చెప్పారు. మంచి ఉద్దేశంతో నిర్మించిన సినిమా ఇదని నిర్మాతలు పేర్కొన్నారు. ఇంకా హీరోహీరోయిన్లు యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల, నటుడు అజయ్, సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర, నోయల్, గాయకుడు పెంచలదాస్ కూడా మాట్లాడారు.

## ప్రతి ఒక్కరిలో హీరో ఉంటాడు!



'ఉగ్రం' సినిమాతో కన్నడనాట మాస్ హీరోగా మంచి గుర్తింపును తెచ్చుకున్నారు శ్రీమురళి. ఆయన తాజా చిత్రం 'బఘీర' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ కథనందించిన ఈ చిత్రానికి సూరి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో శ్రీమురళి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ ఇది. ప్రతి ఒక్కరిలో హీరో ఉంటాడు. పరిస్థితులు డిమాండ్ చేసినప్పుడు మనలోని హీరో బయటకొస్తాడు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులందరూ హీరోల్లాగానే ఫీలవుతారు. ఇందులో నేను పోలీస్ ఆఫీసర్‌గా, మాస్క్‌మ్యాన్‌గా డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తా' అని చెప్పారు. ఈ సినిమాకు అద్భుతమైన కథతో పాటు మంచి టీమ్ కుదిరిందని, ప్రకాష్‌రాజ్ వంటి సీనియర్ నటుడితో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నానని శ్రీమురళి అన్నారు. తెలుగులో తన తొలి చిత్రమిదని, ఇక్కడి ప్రేక్షకుల ఆశీస్సులు తనకు కావాలని ఆయన కోరారు. సినీరంగంలో ఇరవైఏండ్ల ప్రయాణం గురించి మాట్లాడుతూ 'ఈ జర్నీ అద్భుతంగా సాగుతోంది. 'ఉగ్రం' తర్వాత కన్నడలో మంచి బ్రేక్ దొరికింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. 2014 నుంచి నా సినిమాలన్నీ సక్సెస్ కావడం ఆనందంగా ఉంది. కథ బాగుంటే మల్టీస్టారర్ చిత్రాల్లో నటించడానికి కూడా సిద్ధమే' అని చెప్పారు.

## నా ఫార్ములా అదే!




నిత్యామీనన్ ప్రతిభాపాటవాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కెరీర్ ఆరంభం నుంచి అభినయ ప్రధాన పాత్రల్లో మెప్పిస్తున్నది. 'తిరుచిత్రంబళం' చిత్రానికిగాను ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని అందుకుంది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాల ఎంపికలో తన ప్రాధాన్యతల గురించి వివరించింది నిత్యామీనన్. ఆమె మాట్లాడుతూ 'పాత్రల ఎంపికలో నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తీసే కమర్షియల్ సినిమాల్లో నటించడం అస్సలు ఇష్టం ఉండదు. వాటిలో కథానాయిక పాత్రకు అంతగా ఇంపార్టెన్స్ ఇవ్వరు. అలాంటి అవకాశాలు వస్తే సున్నితంగా తిరస్కరిస్తాను. పాత్ర నచ్చితే చిన్న సినిమా అయినా చేస్తాను. కెరీర్ ఆరంభం నుంచి ఇదే ఫార్ములా ఫాలో అవుతున్నా' అని చెప్పింది. ప్రస్తుతం నిత్యామీనన్ విజయ్ సేతుపతితో కలిసి ఓ తమిళ సినిమా చేస్తున్నది. దీనితో పాటు ధనుష్ 'ఇడ్లీకడై' సినిమాలో కథానాయికగా నటిస్తున్నది.

## ధూం ధాం ప్రేమకథ



చేతన్‌కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించిన లవ్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధూం ధాం'. సాయికిశోర్ మచ్చా దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు మారుతి మంగళవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. నాయకానాయికల ప్రేమకథను పరిచయం చేస్తూ టీజర్ మొదలైంది. కథానుగుణంగా ఈ సినిమా తండ్రీకొడుకుల ఎమోషనల్ బాండింగ్‌ని ఆవిష్కరించింది. హీరో చేతన్ కృష్ణ విలేజ్ యాక్షన్ సీన్స్, వెన్నెల కిశోర్ కామెడీ ట్రాక్.. ఇలా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ సాగింది. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, మాటలు: ప్రవీణ్‌వర్మ, కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి, సంగీతం: గోపీసుందర్.

## జాలర్ల జీవన చిత్రం



రమాకాంత్, అవంతిక, భానుశ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సముద్రుడు'. నగేష్ నారదాసి దర్శకుడు. కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై బదావత్ కిషన్ నిర్మిస్తున్నారు. ఈ నెల 25న విడుదకానుంది. ఇటీవల నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు సీనియర్ నటుడు సుమన్, దర్శకుడు సముద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు నగేష్ నారదాసి మాట్లాడుతూ 'మత్స్యకారుల జీవితాలకు దర్పణంగా ఈ సినిమాను తెరకెక్కించాం. జాలర్లు చేపల వేటకు వెళ్లినప్పుడు పడే కష్టాలు, వారు ఎదుర్కొనే సమస్యలను ఈ సినిమాలో చూపించాను. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంటుంది' అన్నారు. సుమన్, రాజ్‌ప్రేమి, రామరాజు, శ్రవణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నగేష్ నారదాసి.

## కటౌట్ చూసి కొన్ని నమ్మేయాలి

చిత్రం



ప్రస్తుతం ఉన్న సక్సెస్‌ఫుల్ నటవారసులంతా 'తండ్రులకి తగ్గ తనయులు', 'అన్నలకు తగ్గ తమ్ముళ్లు', 'తాతలకు తగ్గ మనవళ్లు'. కానీ ప్రభాస్‌ను మాత్రం వీరితో మినహాయించాలి. ఎందుకంటే.. ప్రభాస్ 'తండ్రికి తగ్గ తనయుడు' కాదు. 'తండ్రిని మించిన తనయుడు'. ఈ మాటను నిర్మొహమాటంగా, నిర్భయంగా ఢంకా బజాయించి మరీ చెప్పేయొచ్చు. స్వతహాగానే ఆయన పెదనాన్న కృష్ణంరాజు ఛాతి కాస్త వెడల్పు. ప్రభాస్ పుణ్యమా అని.. గోరంత గర్వంతో.. కొండంత ఆనందంతో అది ఇంకాస్త వెడల్పయింది. జీవించి ఉన్నంత కాలం పెదనాన్నకు కావల్సినంత పుత్రోత్సాహాన్ని ఇచ్చేసిన తనయుడు ప్రభాస్. 2004 సంక్రాంతి గుర్తుందా? ప్రభాస్ మూడో సినిమా 'వర్షం'. కాసుల వర్షమే కురిపించేసింది. 'ఛత్రపతి'లో 'ఒక్క అడుగు' అని అడిగినందుకు అభిమానులు అడుగడుగునా గుండెలలో గుడులు కట్టేశారు. ఇక 'బాహుబలి' గురించి చెప్పేదేముంది.. ప్రపంచవ్యాప్తంగా పద్దెనిమిది వందల కోట్లు. 'సలార్' 600కోట్లు. రీసెంట్ హిట్ 'కల్కి 2898 ఏడీ' వెయ్యికోట్లు. ప్రస్తుతం ప్రభాస్ సినిమా హిట్ అయితే వెయ్యికోట్లు. ఫ్లాపైతే 200కోట్లు. అసలు 'ఈశ్వర్' టైమ్‌లో ఇంతటి వైభవం ఊహించామా!? పాన్ ఇండియా స్టార్‌డమ్‌ని ప్రపంచానికి పరిచయం చేయడమంటే సామాన్యమైన విషయమా!? .. కటౌట్‌ని చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి.. తప్పదు. నేడు ప్రభాస్ పుట్టినరోజు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమనులకు ఇదే పెద్ద పండగ.

## 'ఆర్ఆర్ఆర్'కు మించి..



మహేష్‌బాబుతో తెరకెక్కించబోతున్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ గురించి దర్శకుడు రాజమౌళి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఓ అంతర్జాతీయ ఈవెంట్‌కు హాజరైన ఆయన మాట్లాడుతూ..ఈ సినిమాలో 'ఆర్ఆర్ఆర్' కంటే ఎక్కువ జంతువులు ఉంటాయని అన్నారు. 'నాకు జంతువులంటే ఇష్టం. గతంలో నేను తీసిన చాలా చిత్రాల్లో జంతువులను ఉపయోగించాను. మహేష్‌బాబుతో తీయబోతున్న సినిమాలో మాత్రం ఎక్కువ జంతువులు కనిపిస్తాయి' అని రాజమౌళి తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. జనవరిలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం. అమెజాన్ అడవుల నేపథ్యంలో హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో రాజమౌళి ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక విజువల్ ఎఫెక్ట్స్‌పరంగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించబోతున్నారు. ఇందుకోసం ప్రముఖ హాలీవుడ్ సంస్థ 'ఏ స్టూడియో'తో కలిసి పని చేయబోతున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నారని తెలిసింది. కథా విస్తృతి దృష్ట్యా రెండు పార్ట్‌లు అయితేనే సినిమాకు న్యాయం చేయగలమనే ఆలోచనలో రాజమౌళి ఉన్నారని చెబుతున్నారు. ఈ చిత్రానికి 'గరుడ' అనే టైటిల్‌ను పరిశీస్తున్నట్లుగా వార్తలొస్తున్నాయి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy**. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.